క్లుప్తంగా

104 వాహన సదుపాయం కల్పించాలి

బూర్జ: మండలంలోని తమ్మినాయుడుపేట, కటకమయ్యపేట గ్రామాలకు 104 వాహన సదుపాయం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. బూర్జ మండలం పరిధిలో ఉన్న ఈ రెండు గ్రామాలు ఆమదాలవలస మండలం అక్కులపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్నాయి. ఈ గ్రామాల్లో సమారు 800 మంది జనాభా ఉన్నారు. రెండేళ్ల నుంచి 104 వాహన సిబ్బంది రావడంలేదని సర్పంచ్ ఎం.సుదీప్ష, వైఎస్సార్‌సీపీ నాయకుడు మూడడ్ల సత్యనారాయణ తెలియజేశారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ఇంటింటికీ వైద్య సేవలు అందుతున్నప్పటికీ తమ్మినాయుడుపేట వాసులకు వైద్యం అందక ఇబ్బంది పడుతున్నారు. జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించలేదన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

పొందూరు: పొందూరు మేజర్ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ గురువారం పంచాయతీ కార్యాలయం సమీపంలో ధర్నాను నిర్వహించారు. ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, ఈఎస్ఐ వర్తింపజేయాలని తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు కార్మికులతో కలిసి ర్యాలీ తీశారు. తమ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ ఫలితం లేకపోవడంతో ధర్నాను నిర్వహిస్తున్నామని పి.నాగరాజు, పి.కనకరాజు, పి.కొండయ్య, పి.రాజేష్, పి.బుజ్జి, పి.కనకలక్ష్మి తదితరులు తెలిపారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు బదిలీ

పొందూరు: ఎస్ఎంపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పొందూరు, ఎచ్చెర్ల, జి.సిగడాం మండలాల్లో పనిచేస్తున్న ముగ్గురు సూపర్‌వైజర్లు బదిలీ అయినట్లు గురువారం సీడీపీఓ డి.పాపినాయుడు తెలిపారు. పొందూరు మండలం కింతలి సూపర్‌వైజర్ జీవీ రత్నం విధుల్లో నిర్లక్ష్యంపై రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు నివేదికను రాష్ట్ర ఉన్నతాధికారులకు అందించారు. దీనిపై ఆమెను సోంపేటకు బదిలీ చేసినట్లు సమాచారం. ఎచ్చెర్ల మండలంలో పనిచేస్తున్న సూపర్‌వైజర్ యశోదను శ్రీకాకుళం ప్రాజెక్టుకు, జి.సిగడాం మండలంలో పనిచేస్తున్న రజనీదుర్గను రాజాం ప్రాజెక్టుకు బదిలీ అయ్యారని సీడీపీఓ పాపినాయుడు తెలిపారు. యూడీసీ వంశీలత పాలకొండకు బదిలీ అయినట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సారవకోట: మండలంలోని అలుదు ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రమేష్ గురువారం తెలిపారు. కేశవలస, సత్రాం, పద్మాపురం, గొల్లపేట తదితర గ్రామాలకు ఉదయం 9 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫాను నిలుపుదల చేస్తామన్నారు.

నరసన్నపేటలో..

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం, దేవాది విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని టెక్కలి ఈఈ వీపీ రాజశేఖర్ గురువారం తెలిపారు. 33/11 కేవీ లైన్ల పరిధిలో చెట్ల కొమ్మలు కటింగ్ చేసే పనులు చేపడతామన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలివేస్తామన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత నరసన్నపేట



మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గడిచిన నాలుగు రోజులుగా అంతర్ రాష్ట్ర క్రికెట్ పోటీలు నిర్వహించారు. గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల జట్టుపై నరసన్నపేట జట్టు విజయం సాధించింది. నిర్ణీత 18 ఓవర్లలో మొదట బ్యాటింగ్ చేసిన శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల జట్టు 5 వికెట్లకు 119 పరుగులు చేసింది. 120 లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన నరసన్నపేట జట్టు 12 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. నరసన్నపేట జట్టులో బి.ప్రేమ్ 45 పరుగులు చేసి నాట్ అవుట్‌గా నిలిచి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు ప్రేమ్‌కు దక్కింది.

డీటీగా మధుబాబు

సారవకోట: డిప్యూటీ తహసీల్దార్‌గా మధుబాబును ఉన్నతాధికారులు నియమించారు. ఇక్కడ డీటీగా పనిచేస్తున్న ఎం.సరిత నరసన్నపేట తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ అయింది. భూ సర్వే విభాగంలో పనిచేస్తున్న మధుబాబును ఇక్కడికి డీటీగా నియమించారు.

పేదల జీవితాల్లో వెలుగులు

- ప్రగతి బాటలో ఆంధ్రప్రదేశ్
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్పీకర్ తమ్మినేని సీతారాం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: నవరత్న పథకాల అమలుతో ఆంధ్రప్రదేశ్ ప్రగతి బాటలో పయనిస్తోందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మున్సిపాలిటీలోని 21వ వార్డు కుద్దిరాం గ్రామంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన లబ్ధిని వివరించారు. కుద్దిరాం ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, ప్రతిరోజూ తాగునీరు అందించాలని స్థానికులు విన్నవించారు. ఈ సమస్యలు పరిష్కరించాలని అధికారులను స్పీకర్ ఆదేశించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పట్ల చిత్తశుద్ధి కలిగిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని పాలించడం ప్రజల అదృష్టమన్నారు. ఇటువంటి నాయకుని వద్ద పనిచేయడం వల్ల ఎలాంటి సమస్య అయినా పరిష్కరించగలమన్న ధీమా ఉందన్నారు. అందువల్లే ధైర్యంగా ప్రజల్లోకి వెళ్తున్నామన్నారు. సీఎం జగన్ అమలు చేస్తున్న నవరత్న పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయన్నారు. ప్రతీ సచివాలయానికి ముఖ్యమంత్రి రూ.20 లక్షల నిధులు మంజూరు చేశారని, ఆయా సమస్యలను పరిష్కరించాలనే సీఎం చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమన్నారు. ఏ ఇంటికెళ్లినా సంక్షేమ పథకాలు అందుకున్న ప్రజలంతా ఆనందంతో స్వాగతం పలుకుతున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విస్తృత సేవలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, సచివాలయాల కో ఆర్డినేటర్ అల్లం శెట్టి ఉమామహేశ్వరరావు, పార్టీ నాయకులు బోర చిన్నంనాయుడు, సాదు చిరంజీవిరావు, సాదు సాయి, పార్టీ పట్టణ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, మామిడి ప్రభాకర్‌రావు, మామిడి రమేష్ కుమార్, కుప్పిలి సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

43 మందికి నేత్ర పరీక్షలు



కొత్తూరు: కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు జానకిరామయ్య



ఆమదాలవలస: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తూరు: మండలంలోని గొట్టిపల్లి గ్రామ సచివాలయం పరిధి చీపురుపల్లి గిరిజన గ్రామంలో గురువారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని స్థానిక అప్తాలమిక్ ఆఫీసర్ ఇప్పిలి జానకిరామయ్య నిర్వహించారు. 43 మంది అవ్వాతాతలకు కంటి పరీక్షలు చేపట్టారు. 17 మందికి కళ్లద్దాల అవసరమన్నారు. 28 మందికి అంతర కుసుములు న్నట్లు గుర్తించారు. వీరికి శ్రీకాకుళంలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తామన్నారు. వైద్య సిబ్బంది, ఏఎన్ఎం, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పలువురికి వైద్య పరీక్షలు

ఆమదాలవలస: ఆమదాలవలస గేటులో చిట్టిమ్మ కోటర్స్ వద్ద 'మెండ విమలమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ' ఆధ్వర్యంలో క్రీస్తు రక్షణ సువార్త ఉజ్జీవ సభలు ఏడో వార్షికోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. రాగోలు జెమ్స్ వైద్యులు, డాక్టర్ పి.ఎల్.ఎన్.రాజు ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేపట్టారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జెమ్స్ వైద్యుల ఆధ్వర్యంలో గుండె పరీక్షలు నిర్వహించి వైద్యుని సూచన మేరకు మందులను అందించారు. సుగరు, బీసీ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. మెండ శ్రీనివాసరావు, పాస్టర్స్ రాడ విజయ్‌కుమార్, ఆశిర్ కుమార్, జార్జ్ మల్లార్ తదితరులు పాల్గొన్నారు.

సుందరంగా అమృత్ సరోవర్ చెరువులు



ఉపాధి సిబ్బందికి సూచనలిస్తున్న రామారావు

నరసన్నపేట: మండలంలో అమృత్ సరోవర్ కింద అభివృద్ధి చేస్తున్న గోపాలపెంట చెరువును సుందరంగా తీర్చిదిద్దాలని జిల్లా స్థాయి కమిటీ సభ్యుడు, ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఈఈ సీహెచ్ రామారావు అన్నారు. గురువారం గోపాలపెంటలో చెరువును పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏపీడీ సైలజ, ఏపీఓ యుగంధర్, ఉపాధి మండల ఇంజినీర్ అప్పలరాజు, సర్పంచ్ యండ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే మలేరియా నివారణ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

జలుమూరు: అప్రమత్తతోనే మలేరియా వ్యాధి వ్యాప్తిని నిరోధించగలమని జలుమూరు పీహెచ్‌సీ పర్యవేక్షకులు చిన్నరాజులు అన్నారు. జలుమూరులో మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. వణుకుతో కూడిన జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, వాంతులు, వికారం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి మందులు వాడాలన్నారు.

విశాఖ వెళ్లి పింఛన్ అందజేత



సూర్యనారాయణకు పింఛన్ అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్

నరసన్నపేట: దేవాది గ్రామానికి చెందిన ధర్మాన సూర్యనారాయణ కిడ్నీ వ్యాధికి విశాఖ కేజీహెచ్‌లో గతకొంత కాలంగా చికిత్స పొందుతున్నారు. గురువారం విశాఖ వెళ్లి రూ.10 వేల పింఛన్ అందించినట్లు కోమర్తి వెల్ఫేర్ అసిస్టెంట్ ఇమ్రాన్ ఖాన్ తెలిపారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ఠోత్సవం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

పాతపట్నం: మండలంలోని చిన్నపద్మాపురం గ్రామంలో నిర్మాణం చేపట్టిన కొదండ రామాలయం ప్రతిష్ఠోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు చంద్రమౌళి ఆధ్వర్యంలో హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామస్తులతో పాటు సమీప గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి ఆలయానికి వచ్చి దర్శనం చేసుకున్నారు. మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు ఉంటాయని గ్రామస్తులు తెలిపారు. ఆలయ ధర్మకర్త సలుగు గోపాలస్వామి, సర్పంచ్ సింహాచలం, సలుగు గోవిందరాజులు, రమణ, వెంకటరమణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉపాధి వేతనదారుకి గాయం



చికిత్స పొందుతున్న సుందరమ్మ

బూర్జ: మండలంలోని అన్నపేట గ్రామానికి చెందిన ఉపాధి వేతనదారు దేశెల్ల సుందరమ్మ గురువారం గాయపడింది. గ్రామస్తులు తెలియ జేసిన వివరాల ప్రకారం.. నెయ్యిలవాని చెరువులో భర్త అప్పారావుతో కలిసి ఉపాధి పనులు ముగించుకుని తిరిగి వస్తుండగా.. చెరువు గట్టుపై నుంచి కిందకి పడిపోయింది. ఆమె కుడి కాలుకి గాయం కావడంతో 108 వాహనంలో రాగోలు జెమ్స్ ఆస్పత్రికి తరలించారు. సుందరమ్మకు కుడికాలు విరిగిపోయిందని వైద్యులు తెలియజేశారు.

పింఛన్ల పంపిణీ పరిశీలన



పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న డీఆర్డీఏ ఏపీఓ

ఆమదాలవలస: చింతాడలో (7వ వార్డు) వైఎస్సార్ సామాజిక భద్రత పింఛన్ల పంపిణీని డీఆర్డీఏ ఏపీఓ బి.వి.వి.ఎస్.దొర పరిశీలించారు. గురువారం ఉదయం రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన పింఛన్ల పంపిణీ ప్రక్రియకు ఆధార్ సర్వర్‌లో సాంకేతిక సమస్యతో కొంతసమయం అంతరాయం ఏర్పడింది. దీంతో మధ్యాహ్నం ప్రారంభమైన పింఛన్ల పంపిణీ వేగవంతంగా జరిగేలా చూడాలని డీఆర్డీఏ పీడీ డాక్టర్ డి.వి.విద్యాసాగర్ ఆదేశాల మేరకు పింఛన్ల పంపిణీని పరిశీలించి సూచనలు చేశారు.

అన్నదాతకు భరోసా



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని వీక్షిస్తున్న రైతులు

హిరమండలం: అర్హులైన రైతులందరికీ వైఎస్సార్ రైతు భరోసా కింద తొలి విడతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆర్థికసాయం విడుదల చేసినట్లు ఏఓ బి.సంధ్య తెలిపారు. కర్నూలు జిల్లా పత్తికొండలో రైతు భరోసా-సీఎం కిసాన్ పథకం ద్వారా లబ్ధిదారులకు ముఖ్యమంత్రి గురువారం విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సీఎం ప్రసంగాన్ని రైతులు విన్నారు. మండలంలో 5,760 మంది రైతులకు ఈ పథకం కింద రూ.4.32 కోట్లు నిధులను నేరుగా రైతుల ఖాతాలో జమచేయడం జరిగిందన్నారు.

ఘన జీవామృతంతో అధిక దిగుబడులు



ఘనజీవామృతాన్ని తయారు చేస్తున్న సిబ్బంది

కొత్తూరు: ఘనజీవామృతంతో వరి, ఇతర పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ ఎస్.సూర్యనారాయణ అన్నారు. మండలంలోని శోభనాపురం ఎన్‌పీఎం షాపు వద్ద గురువారం 600 కిలోల ఘనజీవామృతాన్ని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తయారుచేశారు. ఖరీఫ్‌లో నవధాన్యాల సాగు చేసే ముందు పొలంలో ఘనజీవామృతం వేయాలన్నారు. ప్రతీ రైతు ఘనజీవామృతం తయారు చేసుకోవాలన్నారు.

ఏఎంసీ సభ్యుల ప్రమాణ స్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న ఏఎంసీ పాలకవర్గం సభ్యులు



ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ఏఎంసీ చైర్మన్ దుంపల భాస్కరరావు

పోలాకి: సుసరాం గ్రామంలో మాజీ ఎంపీ బొడ్డేపల్లి రాజగోపాలరావు విగ్రహావిష్కరణ, అదే వేదికపై నరసన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) ప్రమాణస్వీకార కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఏఎంసీ చైర్మన్‌గా దుంపల భాస్కరరావు, వైస్ చైర్మన్‌గా దంత సింహాచలం, డైరెక్టర్లుగా వేలాల వెంకటరమణ, అడ్ల చంద్రావతి, పాసిన సరోజని, రావాడ అప్పన్నరాజు, గేదెల వరలక్ష్మి, గొర్లె కుమారి, తోట ముద్దమ్మ, మేడి రూపావతి, సతివాడ ఉమాదేవి, రాజాన సూరమ్మ, పంచిరెడ్డి సత్యనారాయణ, వారణాసి సత్యనారాయణ, కోరాడ చిన్ననర్సింహమూర్తి ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఇలపండ సుందరరావు, కణితి తవుడుల మృతి పట్ల మౌనం పాటించారు. మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి, టెక్కలి వైఎస్సార్‌సీపీ నాయకురాలు దువ్వాడ వాణి, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, పోలాకి మండల పరిషత్ సలహాదారుడు ముద్దాడ బైరాగినాయుడు, నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, పార్టీ పోలాకి మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు, సర్పంచ్ దుంపల ఆనందరావు, ప్రముఖ వైద్యులు దుంపల హరిప్రసాద్, దానేటి శ్రీధర్, బలగ మురళి, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

టీడీపీకి విశ్వసనీయత లేదు

- అభివృద్ధిపై టీడీపీ నాయకులు బహిరంగ చర్చకు రావాలి
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ సవాల్



మాట్లాడుతున్న చిరంజీవినాగ్

ఆమదాలవలస: విలువలు, వ్యక్తిత్వం, విశ్వసనీయత లేని పార్టీ తెలుగుదేశం పార్టీ అని, ఆ పార్టీ నాయకులు కూడా అబద్ధాల కోరులని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ అన్నారు. ఆమదాలవలసలోని గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వ పాలనలో గత ఐదేళ్ల రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని, దోపిడీలు, అక్రమణలు, దందాలను ప్రోత్సహించారన్నారు. ఇటీవల నిర్వహించింది మహానాడు కాదని, మహా ఫ్రాడ్ అని అన్నారు. ప్రజలను మరోసారి మోసం చేసేందుకు పక్క రాష్ట్రాల్లో ప్రకటించిన కొన్ని పథకాలు, మన రాష్ట్రంలో అమలు అవుతున్న కొన్ని పథకాలు మ్యానిఫెస్టోగా ప్రకటించారన్నారు. టీడీపీ మేనిఫెస్టోను చూసి వైఎస్సార్‌సీపీ నాయకుల గుండెల్లో దడపుడుతోందని మాజీ ఎమ్మెల్యే కూన రవికుమార్ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, గత టీడీపీ హయంలో ఐదేళ్లలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. ప్రస్తుతం అభివృద్ధి చేయలేదని ఆరోపించిన రవికుమార్‌కు బహిరంగ సవాల్ విసురుతున్నానని, నియోజకవర్గ ప్రజలందరి సమక్ష్యంలో బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. జెడ్ ప్లెస్ కేటగిరికి చంద్రబాబు అర్హుడు కాదని, దాన్ని తొలగించేందుకు కేంద్రం దృష్టికి విన్నవిస్తానని స్పీకర్ అనడం తప్పు.. అని ప్రశ్నించారు. గతంలో చాలామందికి జెడ్ ప్లెస్ కేటగిరి ఇచ్చి తిరిగి ఆపేసిన సందర్భాలు ఉన్నాయని గుర్తుచేశారు. పార్టీ ముఖ్య నాయకుడు బెవర మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుకల పరిశీలన



కిట్లును సర్దుబాటు చేస్తున్న సిబ్బంది

హిరమండలం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందజేయనున్న జగనన్న విద్యా కానుక కిట్లు సిద్ధంగా ఉన్నాయని ఎంఈఓ కె.రాంబాబు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జె.వి.కె సామగ్రి స్టాక్ పాయింట్‌ను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ జగనన్న విద్యా కానుక కిట్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. స్టాక్ పాయింట్‌కు చేరిన కిట్లును, పాఠశాలల వారిగా తమ సిబ్బందితో కిట్లును సర్దుబాటు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు యూనిఫాంలు 3358, నోటుపుస్తకాలు 17410, పాఠ్యపుస్తకాలు 16489, డిక్షనరీలు 744, స్కూల్ బ్యాగులు 2,330, వర్కు బుక్స్ 4314 వచ్చాయన్నారు. ఇంకా షూస్, షాక్స్, బెల్టలు రావాల్సి ఉందన్నారు. పాఠశాల పునఃప్రారంభం రోజున విద్యార్థులకు అందజేయడం జరుగుతుందన్నారు. సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది ఉన్నారు.

నీలమణిదుర్గ అమ్మవారిని దర్శించుకున్న కృపారాణి



అమ్మవారిని దర్శించుకుంటున్న కృపారాణి

పాతపట్నం: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం పాతపట్నం నీలమణీదుర్గ అమ్మవారిని మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి గురువారం దర్శించుకున్నారు. అమ్మవారికి కుంకుమ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు అర్చకులు అశీర్వాదాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ నూలు ఈశ్వరరావు ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. డాక్టర్ కె.రామ్మోహన్, ఎస్ఐ ఎన్.కామేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా సామాజిక తనిఖీలు

ఎల్.ఎన్.పేట: ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ పారదర్శకంగా చేపట్టాలని ఆ పథకం హిరమండలం క్లస్టర్ ఏపీడీ పంచాది రాధ, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, జెడ్పీటీసీ సభ్యులడు కిలారి త్రినాథులు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం సామాజిక తనిఖీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చేపట్టిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహించటం జరుగుతుందన్నారు. పనుల్లో లోపాలను గుర్తించటంతోపాటు వేతనదారులకు ఉపాధి చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీఓ ఆర్.కాశీప్రసాద్, సామాజిక తనిఖీ ఎస్సార్పీలు కె.మన్మథరావు, కె.వి.రమణ, ఉపాధి ఏపీఓ వి.శ్రీదేవి సామాజిక తనిఖీపై పలు సూచనలు చేశారు. ఉపాధి సిబ్బంది, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.